క్లుప్తంగా

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు



దేశభక్తి గీతం ఆలపిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: ప్రజా నాట్య మండలి ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాఠశాలల విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలను విజేత స్కూల్‌లో నిర్వహించారు. తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌తోపాటు భారతి, విజేత, అంజన, సెయింట్ ఆన్స్, క్రిస్టినా తదితర ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు సుమారు 120 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వారంతా పాఠశాలల వారీగా దేశభక్తి గీతాలు ఆలపించి ప్రతిభ చాటారు. ఆగస్టు 15న విజేతలకు బహుమతులు అందజేస్తామని ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి చంటి తెలిపారు.

ఏయూలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ ఆచార్యులు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ న్యాయ కళాశాల వద్ద గల మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీతా మాణిక్యం, ఏయూ ఆచార్యులు వి.వి.ప్రసాద్, శ్రీనివాసరావు, జర్రె అప్పారావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.ప్రసాదరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ చిట్టిబాబు, పద్మరాజు, రమణ మూర్తి, దావీదు, రామమూర్తి, సత్యనారాయణ, నాగార్జున రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలన మోసపూరితం

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు
- 15, 17 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

మద్దిలపాలెం: ఇచ్చిన హామీలు నెరవేర్చలేని మోసపూరిత కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దామని ప్రజలకు వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, వార్డు ఇన్‌చార్జి నడింపల్లి కృష్ణంరాజు ఆధ్వర్యంలో శనివారం 15వ వార్డు సింహాద్రిపురం 278 బూత్‌లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను వివరించి కరపత్రాలు అందజేశారు. కరపత్రంలో ఉన్న స్కానర్ లోగోను స్కాన్ చేస్తే చంద్రబాబు చేసిన, చేస్తున్న మోసాలను వివరంగా తెలుసుకోవచ్చని నివాసులకు అవగాహన కల్పించారు. కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు తాగునీటి సౌకర్యం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నార న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కరెంట్ కోతలు ఎక్కువైపోయాయని చెప్పారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఇంటింటికీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చి ప్రజలపై ఎనలేని భారాన్ని మోపాలని చూస్తోందని తెలిపారు. మోసపూరిత పరిపాలన చేస్తున్న కూటమి ప్రభుత్వం గద్దె దిగేలా ప్రజలందరూ ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కణితి మరియదాసు, మహిళ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, బీసీ సెల్ అధ్యక్షుడు బుగత యేసురత్నం, వార్డు ఉపాధ్యక్షులు వెంకటరావు, నూకరాజు, రవికుమార్, భాస్కర్, వెళంగిని, శ్రీను, శాంతి కుమారి, మేరీ, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



15వ వార్డులో మహిళకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మొల్లి అప్పారావు, నడింపల్లి కృష్ణంరాజు

చంద్రబాబు మోసాలపై ఇంటింటా ప్రచారం

ఎంవీపీకాలనీ: ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరిస్తూ వైఎస్సార్‌సీపీ 17వ వార్డు నాయకులు శనివారం వార్డులోని 142 బూత్ పరిధిలో ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ వార్డు అధ్యక్షుడు నీలారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా.. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని నాయకులు అన్నారు. అడ్డదారిలో గద్దెనెక్కేందుకే కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చిందంటూ ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఊరుకునేది లేదంటూ కూటమి నాయకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి మహిళకు రూ.1,500, నిరుద్యోగికి రూ.3,000 వంటి హామీలపై నిలదీయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు మహిళా అధ్యక్షురాలు, బూత్ కన్వీనర్ పిల్లా సత్యవతి, జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి నందూరి సుబ్రహ్మణ్యం, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షురాలు పీలా జోషిల, వార్డు పరిశీలకుడు నారాయణరావు, యూత్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు కొండబాబు, ప్రచార కమిటీ అధ్యక్షుడు సాడి దానేస్ తదితరులు పాల్గొన్నారు.



17వ వార్డులో స్థానికులకు కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రతి ఇంటా రాఖీ సందడి

ఆరిలోవ: రక్షా బంధన్ పండగ వేడుకలు శనివారం ఆరిలోవలో ఘనంగా జరిగాయి. అన్నదమ్ములకు అక్కచెల్లెల్లు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు, చిరుకానుకలు అందుకోవడంతో ప్రతి ఇంటా సందడి వాతావరణం నెలకొంది. ఉదయం అన్నదమ్ములు డ్యూటీలకు వెళ్లే సమయం, పాఠశాలలకు బయలుదేరే సమయం, తిరిగి ఇళ్లకు చేరుకున్న తర్వాత రాఖీలు కట్టి సోదర భావం చాటారు. ఆరిలోవ, బాలాజీనగర్, పెదగదిలి, చినగదిలి, తోటగరువు, విశాలాక్షినగర్, ఆదర్శ నగర్ తదితర ప్రాంతాలలో రాఖీ పండగ ఆనందోత్సాహాల నడుమ సాగింది.



దివ్యాంగ బాలల రక్షా బంధన్ వేడుకలు

సీతంపేట: అక్కయ్యపాలెంలోని ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీలో దివ్యాంగ బాలలు రాఖీ పండగను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. సొసైటీ వ్యవస్థాపకురాలు సుచిత్ర బాలకృష్ణ పిల్లల చేత విత్తనాలతో ఎకో ఫ్రెండ్లీ రాఖీలు తయారు చేయించారు. వాటిని పిల్లలకు ఒకరి చేత ఒకరికి కట్టించి స్వీట్లు తినిపించి సంతోషంగా జరుపుకున్నారు. అందరూ కలిసి భోజనాలు చేశారు.



ఆరిలోవలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు

కానిస్టేబుల్‌కు హోం మంత్రి పరామర్శ

ఎంవీపీకాలనీ: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం ఉషోదయ కూడలిలోని ఓ కానిస్టేబుల్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కానిస్టేబుల్‌కు పండ్లు అందజేసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. డిపార్ట్‌మెంట్ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన భార్య, పిల్లలతో మాట్లాడి ఉన్నత చదువులు చదివి తండ్రికి మంచిపేరుతేవాలని సూచించారు. కానిస్టేబుల్ ఇంటికి మంత్రి అనిత ఆటోలో వెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాఖీ పండగ సందర్భంగా ఆటో డ్రైవర్‌కు ఆమె రాఖీ కట్టారు.

మహేష్‌బాబు అభిమానుల సేవా కార్యక్రమాలు

ఎంవీపీకాలనీ: సినీ హీరో సూపర్‌స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు శనివారం 17వ వార్డులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్స్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అసోసియేషన్ ప్రతినిధులు కేక్ కట్‌చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదలకు బియ్యం, పిల్లలకు పుస్తకాల పంపిణీ, రెడ్‌క్రాస్ సొసైటీలోని దివ్యాంగులు, నిరాశ్రయులకు దుప్పట్లు, రగ్గుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పలికిల నీలారెడ్డి, మాదు మంగరాజు, రంగాల శివ, దంప రవికుమార్‌రెడ్డి, సరగడ అప్పలరెడ్డి, పిడింట్ల వెంకట్‌రెడ్డి, నీలాపు అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు విద్యా సామగ్రి అందిస్తున్న మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

'కృష్ణ స్మరణ' పుస్తకావిష్కరణ

ఏయూక్యాంపస్: శ్రీ శారద అన్నమయ్య సంగీత విద్యాలయ రజతోత్సవం బీచ్ రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంగీత విద్వాంసుడు పారుపల్లి సత్యనారాయణ స్థాపించిన శ్రీ శారద అన్నమయ్య సంగీత విద్యాలయం 25వ వార్షికోత్సవంలో భాగంగా పారుపల్లి శ్రీరామ చంద్రమూర్తి రచించిన కృష్ణ స్మరణ పుస్తకాన్ని మిహిర సంపాదకులు ఎం.ప్రద్యుమ్న ఆవిష్కరించారు. రెండున్నర దశాబ్దాలుగా సంగీత సేవ చేస్తూ ఎందరినో సంగీతంలో నిష్ణాతులుగా తీర్చిదిద్దిన సంస్థ కృషిని ఎం.వి.రాజశేఖర్ కొనియాడారు. కృష్ణ స్మరణ పుస్తక విశేషాలను ప్రద్యుమ్న తెలియజేశారు. సంగీత కళాకారులు చైతన్య సోదరులు బి.కృష్ణమాచార్యులు, వారణాసి వెంకటేశ్వరశర్మ, చాగంటి సోమసుందర్లను ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం పారుపల్లి సత్యనారాయణ శిష్యబృందం అన్నమాచార్య సంకీర్తనలు, త్యాగరాజ స్వామి సంకీర్తలను ఆలపించారు. సంగీత గురువు పారుపల్లి సత్యనారాయణ దంపతులకు పాదపూజ చేసి గురు సత్కారం జరిపారు. కార్యక్రమంలో రచయిత పి.శ్రీరామచంద్రమూర్తి, ఏపీఎస్ మూర్తి, పాలూరి శేషమాంబ సాహితీప్రియులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీరామచంద్రమూర్తి, ఎం.వి.రాజశేఖర్ తదితరులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలిలో శ్రీకృష్ణా యువజన సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం స్థానిక శివాలయంలో గ్రామ పెద్దల సమక్షంలో జరిగింది. సంఘ అధ్యక్షుడిగా ఒమ్మి వెంకటప్పారావు, గౌరవాధ్యక్షుడిగా కడుపుట్ల శ్రీనివాసరావు, సలహాదారుగా దూలి రఘుతో పాటు మరో ఆరుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఎంవీపీకాలనీ: ఇసుకతోట కూడలి జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యెర్రగోకుల ఆదిలక్ష్మి అనే మహిళకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పెదగదిలి ప్రాంతానికి చెందిన ఆదిలక్ష్మి ఎంవీపీ కాలనీలోని ఓ చర్చిలో ప్రార్థనకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా.. హైవేపై గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొట్టి వెళ్లిపోయింది. మహిళ కాలి పైభాగాన ఎముక విరగడంతోపాటు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

తగరపువలస: వైద్య ఆరోగ్య సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. శనివారం ఆయన ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రొటీన్ ఇమ్యూనైజేషన్‌పై మాట్లాడారు. 375 మంది డ్రాపౌట్లను గుర్తించి స్టాఫ్ నర్సులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నాటికి డ్రాపౌట్లు అన్నీ క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈహెచ్‌ఆర్ సంతృప్తికరంగా లేదన్నారు. ఆరోగ్యకేంద్రం ఆవరణలో ఉన్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నూతన భవనాన్ని పరిశీలించి, పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది హాజరుపట్టిక, ఆన్‌లైన్ నివేదికలు, మందుల గది, లేబర్ రూమ్, ప్రయోగశాల, వార్డులను పరిశీలించారు. మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రసవ గది, శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాలు సమకూరుస్తామని తెలిపారు. ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి షబీనాభాను, జిల్లా వైద్య ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం పాల్గొన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు